క్లుప్తంగా

నాడు-నేడు పనులు పూర్తి చేయాలి

కర్నూలు(సెంట్రల్): మనబడి నాడు-నేడు పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆయన గురువారం విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్పందన అంశాలపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. బడి బయట ఉన్న విద్యార్థులను గుర్తించి పాఠశాలలకు పంపాలన్నారు. సచివాలయ ఇంజినీరింగ్, వెల్ఫేర్ అసిస్టెంట్లతోపాటు మహిళా పోలీసులు ఎప్పటికప్పుడు పాఠశాలలను సందర్శించాలని సూచించారు. కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఏఓ వెంకటేష్ సస్పెన్షన్

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్ ఏఓగా విధులు నిర్వహిస్తూ దీర్ఘకాలిక సెలవులో వెళ్లిన జి.వెంకటేష్‌ను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన సస్పెండ్ చేశారు. ఈ మేరకు గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఏఓగా జీ సెక్షన్ సూపరింటెండెంట్ శ్రీనాథ్ విధులు నిర్వహిస్తున్నారు. కల్లూరు తహసీల్దార్ రమేష్‌బాబును ఏఓగా నియమించాలని ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

భూ లబ్ధిదారుల జాబితా ప్రదర్శించాలి

కర్నూలు(సెంట్రల్): సీసీఎల్ఏ గైడ్‌లైన్స్ ప్రకారం ప్రతి గ్రామంలో అసైన్‌మెంట్ భూములు పొందిన లబ్ధిదారుల జాబితాను గ్రామ సచివాలయాల్లో నోటీసు బోర్డులో ఉంచాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కేవీ నారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సీపీఎం నాయకులు ఆర్‌డీఓ హరిప్రసాద్‌కు వినతిపత్రం ఇచ్చారు. అసైన్‌మెంట్ భూముల అనుభవంలో ఉన్న పేదల అభిప్రాయాన్ని స్వేచ్ఛగా చెప్పే హక్కును కల్పించాలని కోరారు. 9/77 చట్ట సవరణను రద్దు చేయాలని, ప్రజాభిప్రాయం లేకుండా చేస్తున్న ఆన్‌లైన్ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీబీ ఉసేనయ్య, జి.గోపాల్, ఆంజనేయులు, శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

హాస్టల్ సౌకర్యం కల్పించండి

కర్నూలు(అర్బన్): కళాశాల విద్య అభ్యసిస్తున్న గిరిజన బాలికలకు జిల్లా కేంద్రంలో వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు అక్కులప్ప, రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ చంద్రప్ప కోరారు. ఈ మేరకు గురువారం గిరిజన సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్ రవీంద్రబాబును కలిసి వినతి పత్రం అందించారు.వారు మాట్లాడుతూ.. ఉమ్మడి కర్నూలు జిల్లాలో అనేక మంది గిరిజన బాలికలు ఆర్థిక స్థోమత లేక ఉన్నత విద్యకు దూరం అవుతున్నారన్నారు. కర్నూలు, నంద్యాల జిల్లా కేంద్రాల్లో గిరిజన బాలికలకు వసతి గృహాలను ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి విష్ణు నాయక్, వెంకటేష్‌నాయక్ తదితరులు ఉన్నారు.

సీపీఐ నేత బాలయ్య మృతి తీరనిలోటు

కర్నూలు(సెంట్రల్): సీపీఐ సీనియర్ నాయకుడు బాలయ్య మృతి పార్టీకి తీరని లోటని జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.జగన్నాథం, నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి, సహాయ కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. గురువారం బాలయ్య మరణ వార్తను తెలుసుకొని వారు ఆయన మృతికి సంతాపం ప్రకటించారు. మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. 1994లో వీకే ఆదినారాయణ రెడ్డి నగర్ ఏర్పాటులో బాలయ్య తీవ్ర కృషి చేశారని, నాటి నుంచి ఆయనే ఆ నగర వార్డు బాధ్యతలు చూస్తున్నారన్నారు.

డాక్టర్ మాణిక్యరావుకు సన్మానం



డాక్టర్ మాణిక్యరావును సన్మానిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి, వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): అనంతపురం ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పదోన్నతి పొందిన డాక్టర్ మాణిక్యరావును గురువారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ ఆసుపత్రిలోని గైనిక్ విభాగంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకటరంగారెడ్డి మాట్లాడుతూ గైనిక్ విభాగంలో డాక్టర్ మాణిక్యరావు అందించిన సేవలను కొనియాడారు. సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి. వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ హేమనళిని, ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

26న రెవెన్యూ కార్యాలయాల వద్ద నిరసన

కర్నూలు(సెంట్రల్): తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో కర్నూలును కరువు జిల్లాగా ప్రకటించాలని కోరుతూ ఈనెల 26వ తేదీన సీపీఐ, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిరసనలకు పిలుపునిచ్చినట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.జగన్నాథం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ధర్నాలో రైతులు, రైతు కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.







గౌలిగేరిలో శివలింగంతో ఆటలాడుతున్న బాలగణేశుడి ప్రతిమ,చిత్తారి వీధి నాలుగు చౌరస్తా వద్ద కొలువైన గణనాథుడు, మద్దూరు నగర్‌లో.. ,లక్ష్మీ నగర్ ప్రధాన వీధిలో.. పాత కొట్టాల వద్ద..

దండాలయ్యా.. ఉండ్రాలయ్యా

కర్నూలు కల్చరల్: కర్నూలు నగరంలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు వేడుకగా సాగుతున్నాయి. నాలుగో రోజు గురువారం వినాయకుడి ఆలయాలతో పాటు గణనాథుని మండపాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమాలు, అర్చనలు, సామూహిక కుంకుమార్చనలు, విష్ణు, లలితా సహస్ర పారాయణాలు, భజనలు, ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు వినాయక మండపాలకు వెళ్లి గణనాథులని దర్శించుకొని పూజల్లో పాల్గొన్నారు. శ్రీ గణేష్ మహోత్సవ కేంద్ర సమితి ప్రతినిధులు వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను సందర్శించి పూజల్లో పాల్గొన్నారు. నగరంలోని పలు కాలనీల్లో ఏర్పాటు చేసిన వినాయక పూజల్లో మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి పాల్గొని అన్నదానం చేశారు. పలు చోట్ల మండపాల నిర్వాహకులు పిల్లలు, మహిళలకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. అన్నదాన కార్యక్రమాలు జరిగాయి.



1వ వార్డులో వినాయక మండపం వద్ద పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి



దేవనగర్‌లో..



బాలాజీ నగర్‌లో..



చిన్న మార్కెట్ వద్ద..



కుమ్మరి వీధి సుంకులమ్మ ఆలయం వద్ద..



లక్ష్మీనివాస్ కాలనీలో బహుమతుల పంపిణీ

టీడీపీ నేతలు చట్టానికి కట్టుబడాలి



ఎం.సుభాష్ చంద్రబోస్

కర్నూలు(రాజ్‌విహార్): తెలుగుదేశం పార్టీ నేతలు చట్టాలకు కట్టుబడి ఉండాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్ అన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. మాజీ సీఎం చంద్రబాబునాయుడు అధికారాన్ని అడ్డుపెట్టుకొని అవినీతికి పాల్పడ్డారని, అన్ని ఆధారాలతో సీఐడీ పోలీసులు అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరు పరుచగా జడ్జి రిమాండ్ విధించారని పేర్కొన్నారు. చంద్రబాబు న్యాయస్థానంలో నిర్దోషిత్వం నిరూపించుకోవాల్సి ఉందని, దీనిపై టీడీపీ నేతలు అనవసర రాద్ధాంతం చేయడం తగదన్నారు. చట్టాల నుంచి ఎవరికీ మినహాయింపు ఉండదనే జ్ఞానం టీడీపీ నేతలకు లేకపోవడం విచారకరమన్నారు. కొంతమంది తొడలు కొట్టి, మీసాలు తిప్పినంత మాత్రాన తప్పు ఒప్పు కాదని పేర్కొన్నారు. నారా లోకేష్ కూడా అవినీతికి పాల్పడ్డాడు కాబట్టే ఢిల్లీకి వెళ్లి దాక్కున్నాడని ఆరోపించారు. చట్టానికి కట్టుబడకపోతే వచ్చే ఎన్నికల్లో ప్రజలు తరిమికొడుతారని హెచ్చరించారు.

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్): కర్నూలు నగరంలోని నంది కొట్కూరు రోడ్డులో ఉన్న సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ కోతలు విధించనున్నట్లు కర్నూలు ఆపరేషన్స్ ఈఈ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ పరిధిలోని గణేష్ నగర్, సాయి వైభవ్ కాలనీ, రెవెన్యూ కాలనీ, ఫోర్త్‌క్లాస్ ఎంప్లాయీస్ కాలనీ, పార్థసారథీ టవర్స్, శ్రీవారి కుటీర్, రామ్‌నగర్, జొహరాపురం రోడ్డు, సరస్వతి నగర్, శేషాద్రి నగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రత్యామ్నాయంగా సరఫరా అందించే చర్యలు చేపడుతామని, అయితే ఓవర్ లోడ్, ఇతర కారణాలతో అంతరాయం ఏర్పడితే సహకరించాలని కోరారు.

డీఆర్వోను కలిసిన నాయకులు

కర్నూలు(సెంట్రల్): ఏపీ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం, ఆల్‌మేవా సంఘం నాయకులు గురువారం డీఆర్వో కె.మధుసూదన్‌రావును ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పూలబొకేను అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో వీఆర్వోల సంఘం ఉమ్మడి జిల్లా నాయకులు తిరుమలరెడ్డి, నాగమద్దయ్య, శ్రీధర్, ఆల్‌మేవా నాయకులు మౌలిబాషా, షఫీ, జాకీర్ తదితరులు ఉన్నారు. అలాగే రెండో విడత ఎంబీబీఎస్ కౌన్సెలింగ్‌ను రద్దు చేసి రిజర్వేషన్ అభ్యర్థులకు న్యాయం చేయాలని కాంగ్రెస్ నాయకులు లాజరస్ ఎజాస్, హుస్సేన్, బి.సుబ్రమన్యం తదితరులు విన్నవించారు.

అభ్యుదయ కవి గురజాడ

కర్నూలు(సెంట్రల్): సంఘ సంస్కర్త, నవయుగ కవిగా గురజాడ అప్పారావు సమాజంలో నెలకొన్న సాంఘిక దురాచారాలను నిర్మూలించేందుకు కృషి చేశారని అరసం ఉపాధ్యక్షుడు జహీర్ అహ్మద్ అన్నారు. గురువారం సీపీఐ కార్యాలయంలో గురజాడ అప్పారావు 161వ జయంతి నిర్వహించారు. గురజాడ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వ్యవహారిక భాషలో రచనలు చేసి ప్రజలను చైతన్యం చేసిన ఘనత గురజాడకు దక్కుతుందని కొనియాడారు. సమాజానికి ఉపయోపడే కన్యాశుల్కం, దిద్దుబాటు, సంస్కర్త హృదయం, దేశభక్తి గేయం, పూర్ణమ్మ కథ, కన్యక రచనలు చేశారన్నారు. నాయకులు శ్రీనివాసులు, డి.సోమన్న షాబీర్ బాష, శరత్‌కుమయార్, నాగరాజు, హనుమంతు పాల్గొన్నారు.

అల్జీమర్స్‌తో జీవితం అస్తవ్యస్తం

కర్నూలు(హాస్పిటల్): మతిమరుపు కంటే భయంకరమైనది అల్జీమర్స్ అని న్యూరోఫిజీషియన్ డాక్టర్ నాగసురేష్ అభిప్రాయపడ్డారు. ప్రపంచ అల్జీమర్స్ డేను పురస్కరించుకుని గురువారం స్థానిక మెడికవర్ హాస్పిటల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ వ్యాధి వచ్చిందంటే మెదడుకు సమస్యేనని, ప్రతి క్షణమూ నరకమేనని చెప్పారు. ఈ వ్యాధి రాకుండా మెదడుకు పనిచెబుతూనే ఉండాలని, రకరకాల ఫజిల్స్ ఆడాలని, లెక్కలు చేస్తూ ఉండాలని, సుడోకు లాంటివి ఆడాలని చెప్పారు. మెదడుకు మేలుచేసే ఖర్జూరాలు, ఆకుకూరలు, కూరగాయలు, గింజలు, పప్పులు, డ్రైఫ్రూట్స్ తీసుకోవాలని సూచించారు. డాక్టర్లు చైతన్యకుమార్, నీలారెడ్డి పాల్గొన్నారు.

గెలుపోటములను స్ఫూర్తిగా తీసుకోవాలి



బాస్కెట్‌బాల్ క్రీడాంశంలో పోటీపడుతున్న ఇరు జట్లు

కర్నూలు (టౌన్): క్రీడాపోటీల్లో గెలుపోటములను స్ఫూర్తిగా తీసుకోవాలని, క్రమశిక్షణతో రాణించాలని జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి జమీర్ బాషా అన్నారు. గురువారం స్థానిక సిల్వర్ జూబ్లీ కళాశాల క్రీడామైదానంలో అండర్-19 విభాగంలో బాస్కెట్‌బాల్ పోటీలు, బి.క్యాంపు బాలికల ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సాఫ్ట్‌బాల్ క్రీడాంశంలో ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీవీఈఓ మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఏర్పడిందన్నారు. బాల బాలికలు పుస్తకాలతో కుస్తీ పడుతూనే క్రీడల్లో పాల్గొనాలన్నారు. ఎంతో మంది క్రీడాకారులు మన కళ్ల ముందు ఆడుతూ దేశ స్థాయిలో ప్రతిభ చాటుతున్నారన్నారు. వారిని ఆదర్శంగా తీసుకొని క్రీడల్లో నిత్య సాధన చేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చాన్నారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి పద్మావతి పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



మేయర్ బీవై రామయ్యకు వినతిపత్రం ఇస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్ అసోసియేషన్ నాయకులు

కల్లూరు: మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. ఏపీ మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్ అసోసియేషన్ నాయకులు గురువారం మేయర్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి తమ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రమిచ్చారు. సర్వీస్‌ను పరిగణలోకి తీసుకొని కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, రిటైర్మెంట్ అయిన కార్మికులలో వారి పిల్లలకు అవకాశం కల్పించాలని కోరారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, రిస్క్ అలవెన్స్‌లు ఇవ్వాలని కోరారు. మేయర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కార్మికుల సమస్యను పరిష్కరిస్తూ ఔట్ సోర్సింగ్ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి, అభ్యున్నతికి కృషి చేస్తుందన్నారు. కార్మికులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, కోశాధికారి రమేష్, జిల్లా అధ్యక్షుడు మనోహర్, నగర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కనెక్షన్ల మంజూరులో జాప్యం వద్దు

- నిర్లక్ష్యం చేస్తే జీతాల్లో కోత
- బిల్లులు వంద శాతం వసూలు చేయాలి
- ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ సుబ్బరాజు



మాట్లాడుతున్న డైరెక్టర్ సుబ్బరాజు

కర్నూలు(రాజ్‌విహార్): వ్యవసాయ, ఇతర విద్యుత్ కనెక్షన్ల మంజూరులో జాప్యం లేకుండా చూడాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ డైరెక్టర్ (టెక్నికల్) సుబ్బరాజు విద్యుత్ శాఖ అధికారులను హెచ్చరించారు. గురువారం ఆయన స్థానిక విద్యుత్ భవన్‌లో ఎస్ఈ ఎం. ఉమాపతితో కలిసి కర్నూలు టౌన్, రూరల్స్ ఆపరేషన్స్ డివిజన్ల ఈఈలు, ఏడీఈలు, అకౌంట్స్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సబ్ డివిజన్ వారీగా పురోగతి, వైఫల్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు మెరుగైన సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకు తగ్గట్లు పని చేయాలని ఆదేశించారు. కనెక్షన్ల మంజూరు, వినియోగదారుల సమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని, అవసరమైతే నిబంధనల ప్రకారం జీతాల్లో కోతలు విధిస్తామని హెచ్చరించారు. వృథా ఖర్చులు తగ్గించి ఆదాయం పెంచేందుకు తగిన చర్యలు చేపట్టాలని, ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్స్ తగ్గించాలన్నారు. నెలవారి విద్యుత్ బిల్లులను వంద శాతం వసూలు చేసి పురోగతి చూపాలని, ప్రతినెల స్పాట్ బిల్లింగ్‌ను ప్రతి నెలా 10వ తేదీలోగా పూర్తి చేయాలని సూచించారు. వినియోగదారులకు ఇచ్చిన గడువులోపు బిల్లులను రాబట్టాలన్నారు. వీటితో పాటు సంస్థకు భారంగా మారిన పాతబకాయిలపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మొండి బకాయిలు వసూలు కాని పక్షంలో కనెక్షన్ తొలగించి సరఫరా నిలిపివేయాలని ఆదేశించారు. గాలి, ఇతర కారణాలతో ఏర్పడే బ్రేక్ డౌన్స్, ఇతర సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే స్పందించాలని, మంజూరైన పనులు వేగవంతంగా పూర్తి చేసి వర్క్ ఆర్డర్లు క్లోజ్ చేయాలని ఆదేశించారు. సబ్‌స్టేషన్ల పర్యవేక్షణ, నిర్వహణ ఎంతో ముఖ్యమని, అప్పుడే అంతరాయం సమస్యలు తగ్గుతాయని చెప్పారు. నిరంతర విద్యుత్ సరఫరాలో సమస్య లేకుండా చూడాలన్నారు. సమావేశంలో ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి, ఆపరేషన్స్ ఈఈ రమేష్, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ చిన్న రాఘవులు, ఏడీఈలు, ఏఈలు, ఏఓలు పాల్గొన్నారు.

గణనాథునికి ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న మేయర్, కమిషనర్

కల్లూరు: కల్లూరు అర్బన్ 41వ వార్డు ఎలుకూరు బంగ్లాలో ఏర్పాటు చేసిన గణనాథునికి మేయర్ బీవై రామయ్య, కమిషనర్ భార్గవతేజ ప్రత్యేక పూజలు చేశారు. పూజా కార్యక్రమానికి వచ్చిన మేయర్ రామయ్య, కమిషనర్ భార్గవతేజను వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు శాలువాలతో సత్కరించారు. కార్పొరేటర్ శ్వేతా రెడ్డి,నాయకులు కవినాథ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

జిల్లా కలెక్టర్‌ను కలిసిన డీసీ



కలెక్టర్ డాక్టర్ సృజనను కలిసిన దేవదాయ శాఖ కర్నూలు జోన్ డీసీ పి.గురుప్రసాద్

కర్నూలు కల్చరల్: దేవదాయ శాఖ కర్నూలు జోన్ నూతన డిప్యూటీ కమిషనర్ పి.గురుప్రసాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన ఇటీవల డీసీగా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆలయాల అభివృద్ధిపై కలెక్టర్ సమీక్షించారు. ఉప కమిషనర్‌తో పాటు డీసీ కార్యాలయ సూపరింటెండెంట్ పాండురంగారెడ్డి, దేవదాయ శాఖ సిబ్బంది ఉన్నారు.

23న రగ్బీ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక బి.క్యాంపు క్రీడా మైదానంలో రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీన రగ్బీ అండర్-18 బాల బాలికల జట్లకు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు రగ్బీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రామాంజనేయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2005 నుంచి 2007 మధ్య జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 1, 2 తేదీలలో కర్నూలులో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి రగ్బీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి కలిగిన బాల బాలికలు రూ.10 దరఖాస్తు రుసుం చెల్లించి పోటీల్లో పాల్గొనవచ్చన్నారు.

పీజీ పరీక్షలకు 21 మంది గైర్హాజరు

కర్నూలు(న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలోని ఆరు కేంద్రాల్లో నిర్వహిస్తున్న పీజీ రెండవ సెమిస్టర్ పరీక్షలకు 115 మందికి గానూ 94 మంది విద్యార్థులు హాజరయ్యారని, 21 మంది గైర్హాజరైనట్లు వీసీ ఎ.ఆనందరావు తెలిపారు.

చట్టసభల్లో రిజర్వేషన్లతో మహిళా సాధికారత



వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న దృశ్యం

కర్నూలు(రాజ్‌విహార్): చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించడంతో మహిళలకు ఎంతో మేలు జరుగనుందని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జ్ శ్వేతారెడ్డి అన్నారు. గురువారం స్థానిక బిర్లా కాంపౌండ్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆమె మాట్లాడారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశ పెట్టిందని, దీనికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు తెలపడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేసి చరిత్ర సృష్టించారని కొనియాడారు. చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్ కల్పించడం ద్వారా స్త్రీలు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశాలు ఉంటాయన్నారు. గత ప్రభుత్వం మహిళలకు సున్నా వడ్డీ, రుణమాఫీ పేరుతో మోసం చేసిందని, తమ తమ ప్రభుత్వం చెప్పినదాని కంటే మించి మేలు చేసిందని వివరించారు. కార్పొరేటర్ అర్షియా ఫర్హిన్, పార్టీ కల్చరల్ విభాగం జోనల్ ఇన్‌చార్జ్ నాగమణి, మహిళా విభాగం నాయకులు చంద్రిక, సుభాషిణి రెడ్డి, లావణ్య, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం దృష్టికి బీసీ రిజర్వేషన్ల అంశం

కర్నూలు(అర్బన్): బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే అంశాన్ని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద గురువారం నిర్వహించిన ధర్నా ద్వారా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు బీసీ సంక్షేమ సంఘం సౌత్ ఇండియా అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు, బీసీ విద్యార్థి,యువజన సంఘం జాతీయ కార్యదర్శి కే.రామక్రిష్ణ తెలిపారు. ధర్నాకు ఏపీ, తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు రాష్ట్రాల నుంచి ముఖ్య బీసీ నేతలతో పాటు రాజ్యసభ సభ్యులు ఆర్. క్రిష్ణయ్య, బీద మస్తాన్‌రావు, సంతోష్ లింగయ్యయాదవ్ హాజరయ్యారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని కోరారు. కురువ కురుబ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దిలేటి, జోషి రాఘవేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించండి

కర్నూలు (టౌన్): మీ సేవా కేంద్రాల్లో ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని డీఎల్‌డీఓ బాలకృష్ణా రెడ్డి స్పష్టం చేశారు. గురువారం స్థానిక పూల బజార్, ఖల్లా వీధి, చిన్నమార్కెట్ వద్ద ఉన్న మీసేవా కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. సెంటర్‌లో నిర్వహణ, రిజిస్టర్లు, రిసిప్టులు, తీసుకునే చార్జీలను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

బీజేపీతోనే సుపరిపాలన

కర్నూలు కల్చరల్: దేశ సుపరిపాలన, పేదల సంక్షేమం బీజేపీతోనే సాధ్యం అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ అన్నారు. గురువారం స్థానిక బీజేపీ కార్యాలయంలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ మినిస్టర్ ఆఫ్ ఇన్‌ఫర్మేషన్, బ్రాడ్‌కాస్టింగ్ శాఖ భారత ప్రభుత్వం వారి సూచికను విడుదల చేశారు. బీజేపీ పాలనలో ఒకే దేశం ఒకే రేషన్‌కార్డు విధానం, దివ్యాంగులకు రిజర్వేషన్ల పెంపు, 401 ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాలలను ప్రారంభించారన్నారు. ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మీసాల ప్రేమ్‌కుమార్, నాయకులు సాయిప్రదీప్, రంజిత్, చంద్రశేఖర్, అనురాధ, హరి, మధు తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలపై సెమినార్



జిల్లా స్థాయిలో జరిగిన జాతీయ సెమినార్‌లో ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు

కర్నూలు సిటీ: చిరు ధాన్యాల ప్రాధాన్యతపై నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియం, విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ టెక్నలాజికల్ మ్యూజియం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక సైన్స్ సెంటర్‌లో 'మిల్లెట్స్ ఏ సూపర్ ఫుడ్' అంశంపై జాతీయ సెమినార్ నిర్వహించారు. ఇందులో అన్ని యాజమాన్యాలకు చెందిన 8, 9, 10వ తరగతులకు చెందిన విద్యార్థులు పాల్గొని ప్రదర్శనలు ఇచ్చారు. జిల్లా స్థాయిలో జరిగిన సెమినార్‌లో షమితారెడ్డి (9వ తరగతి ఏక్యాంపు మాంటిస్సోరి స్కూల్), హర్షితా (10వ తరగతి, ఇండస్ స్కూల్), ప్రియదర్శిని(8వ తరగతి, కేజీబీవీ వెల్దుర్తి) వరుసగ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరిని డీఈఓ డా.వి రంగారెడ్డి అభినందించారు. ఈ సెమినార్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో నిర్వహించే సెమినార్‌లో పాల్గొనున్నారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఆచార్యులు డా.చంద్రమోహన్, సిల్వర్‌జూబ్లీ కాలేజీ ఆచార్యులు డా.స్వప్నశ్రీ, జిల్లా సైన్స్ కో-ఆర్డినేటర్ రంగమ్మ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.